

ఆంధ్రజ్యోతి విజిట్

ఇది హాస్టల్ భవనమే..!

ధర్మారం : మండలంలోని మేడారం గురుకుల బాలుర పాఠశాల వసతిగృహంలో సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. విద్యార్థులకు పడుకోవడానికి బెడ్స్ లేక కింద పడుకోవాల్సిన పరిస్థితి. గదుల్లోని ఫ్లోర్ పూర్తిగా చెడిపోయింది. కిటికీలకు, వెంటిలేటర్లకు తలుపులు లేవు. కప్పుకోవడానికి దుప్పట్లు కూడా ప్రభుత్వం నుంచి అందలేదు. వేడి నీళ్ల సౌకర్యం లేక బోర్‌వెల్ వద్ద స్నానాలు చేస్తున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నా శుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అసౌకర్యంగా వసతి గృహాలు

- సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేవు
- కొన్నింటిలో బెడ్లు, పరుపులు లేక నేలమీదే నిద్ర
- కొన్ని హాస్టళ్లకు దుప్పట్లు పంపిణీ లేక చలికి గజగజ
- అధికారులు, వార్డెన్ల పర్యవేక్షణ కరువు
- జిల్లాలో హాస్టళ్లపై 'ఆంధ్రజ్యోతి' విజిట్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా లేక విద్యార్థులు జ్వరాలబారిన పడుతున్నారు. పలు వసతి గృహాల విద్యార్థులకు దుప్ప ట్లు పంపిణీ చేయక చలికి గజగజ వణుకుతున్నారు. ఇళ్ల నుంచి తెచ్చుకున్న దుప్పట్లనే వాడుతున్నారు. కొన్ని వసతిగృహాలకు తలుపులు సరిగా లేక, కిటికీల తలుపులు లేక అట్టలు, బట్టలు అడ్డుగా పెట్టి చలి నుంచి రక్షణ పొందుతున్నారు. కొన్నింటిలో సరిపడా బెడ్లు లేక నేలపైనే నిద్రిస్తున్నారు. చాలా వసతిగృహాల్లో డైనింగ్ టేబుళ్లు లేక కిందనే కూర్చుని భోజనాలు చేస్తున్నారు. హాస్టల్ పరిసరాలు, కిచెన్‌లను అపరిశుభ్రంగా ఉంటున్నాయి. మెనూ ప్రకారమే భోజనాలు పెడుతున్నప్పటికీ, వసతుల విషయంలోనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, ధర్మారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, కమాన్‌పూర్, మంథని, గోదావరిఖని, రామగుండం, పాలకుర్తి మండలాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 11 ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో 7 బాలుర, 4 బాలికల హాస్టళ్లు ఉన్నాయి. పోస్టుమెట్రిక్ హాస్టళ్లు 6ఉండగా, ఇందులో 4 బాలుర, 2బాలికల హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 840 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తు న్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 6ఉండగా, ఇందులో 4 బాలురు, 2 బాలికల హాస్టళ్లున్నాయి. పోస్టుమెట్రిక్ హాస్టళ్లు 8ఉండగా, 14 హాస్టళ్లు ఉండగా ఇందులో 4బాలురు, 4బాలికల హాస్టళ్లు ఉన్నాయి.

మిగతా 8వ పేజీలో..

కింద కూర్చునే భోజనం



జూలపల్లి బీసీ బాలికల హాస్టల్‌లో నేలపైనే కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థినులు

జూలపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో కనీస వసతులు లేవు. డైనింగ్ హాల్ లేకపోవడంతో కిందనే కూర్చుని భోజనం చేస్తున్నారు. బ్లాంకెట్లను ప్రభుత్వం సమకూర్చలేదు. ఇళ్ల నుంచి తెచ్చుకున్న దుప్పట్లనే వాడుతున్నారు.

తలుపులులేని బాత్‌రూంలు..



ఎస్సీ బాలుర హాస్టల్లో తలుపులులేని బాత్‌రూంలు

కాల్వశ్రీరాంపూర్ : మండలంలో ఎస్సీ బాలుర హాస్టల్లో మరుగుదొడ్లు, బాత్రూమ్ లకు సరిగా తలుపులు లేవు. వర్షం పడితే హాస్టల్ స్లాబ్ నుంచి తడి వస్తోంది. కస్తూర్బా బాలికల పాఠశాలలో నీటి సమస్య ఉంది. పాండవుల గుట్ట పైన ఈ హాస్టల్స్ ఉన్న కారణంగా మూడు బోర్లు వేసినా నీరు పడడం లేదు.

ఇరుకు గదిలో..



పడకగదిలోనే భోజనాలు చేస్తున్న విద్యార్థులు

పాలకుర్తి : మండలంలోని జయ్యారం ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతిగృహానికి పక్కా భవనం లేదు. గ్రామపంచాయతీ అప్పగించిన ఒక్క ఇరుకైన పడక గదిలోనే కాలం వెల్లదీస్తున్నారు. సరిపడా బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు లేవు. డైనింగ్ హాలు లేకపోవడంతో ఉదయం ఆరుబయట సాయంత్రం పడక గదిలోనే భోజనాలు చేస్తున్నారు.

బెడ్స్ కొరత..



ఎస్సీ కళాశాల బాలుర సంక్షేమ వసతిగృహంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖనిలోని సంక్షేమ వసతిగృహాలు అసౌకర్యాలతో కొనసాగుతున్నాయి. వసతిగృహాల్లోని విద్యార్థులు బెడ్స్ లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. మార్కండేయ కాలనీలోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో గదులకు తలుపులు సరిగా లేకపోవడంతో పాటు మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

రుణమాఫీపై బురద చల్లే ప్రయత్నం

- 90 శాతం మందికి రుణ మాఫీ.. నిరూపించేందుకు సిద్ధం
- లేకుంటే రాజీనామా.. నిరూపిస్తే కేటీఆర్ రాజీనామా చేయాలి
- అసెంబ్లీలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సవాల్



అసెంబ్లీలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభు త్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని, తన నియోజకవర్గంలో 90 శాతం మంది రైతులకు రుణ మాఫీ జరిగిందని, దమ్ముంటే పెద్దపల్లికి రావాలని కేటీఆర్‌కు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సవాల్ విసిరారు. నిరూపించకుంటు రాజీనామా చేస్తానని, నిరూపిస్తే మాత్రం కేటీఆర్ రాజీనామా చేయాలన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను రుణమాఫీ పేరిట మభ్యపెట్టి మోసం చేశారని మండిపడ్డారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ 4 విడతల్లో మాఫీ చేసిన లక్ష రూపాయలు వడ్డీలకే సరిపోయిందన్నారు. ఇది రైతులను మోసం చేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. రుణమాఫీ కాలేదని ప్రతిపక్ష నాయకులు కేటీఆర్ పేర్కొనడం దారుణమన్నారు. పదేపదే అబద్ధాలు వల్లించి దానినే నిజంగా చూపే ప్రయత్నం కేటీఆర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే పెద్దపల్లి నియోజకవర్గానికి వస్తే దాదాపు 90శాతం రుణమాఫీ జరిగినట్లు చూపిస్తానన్నారు. చూపించకుంటే తాను రాజీనామాకు సిద్ధమని, లేకుంటే కేటీఆర్ రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. సన్నవడ్లకు తన పెద్దపల్లి నియోజకవర్గంలోనే రూ.51కోట్ల బోనస్ రైతులకు లభిస్తున్నాయని, ఇందులో రూ.46కోట్లు రైతుల ఖాతాలో జమయ్యాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతాంగాన్ని నిలువునా ముంచారని మండిపడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క నీరు అందించలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు తమ ప్రాంతానికి ఇక్కడి నుంచి గోదావరి జిల్లాలను తీసుకువెళ్లేందుకే ప్రయత్నం చేశారన్నారు. మూడేళ్ల కాకముందే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, లక్షలాది రూపాయలు నీటి పాలు అయ్యాయన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదర లేదని ఆయన గుర్తుచేశారు. ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైస్ మిల్లర్లతో కుమ్మక్కై వడ్ల కటింగ్ పేరిట అందినంత దోచుకున్న చరిత్ర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదని విమర్శించారు.

మురుగు కాలువలో నిలబడి కౌన్సిలర్ నిరసన



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ సరేష్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని 12 వ వార్డు కౌన్సిలర్ సరేష్‌బాబు శనివారం మురికి కాలువలో నిల్చోని నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వార్డులో బీటీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు డ్రైనేజీ నిర్మాణం చేయక ముందే రోడ్డు నిర్మాణం చేపట్టడంతో డ్రైనేజీ నీరు కాలనీలోకి వస్తుందని, వెంటనే మురికి కాలువ నిర్మించాలని డిమాండ్ చేశాడు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్ చేరుకొని డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. దీంతో సరేష్ నిరసన విరమించారు.

ఇటుక బట్టీలో ఒడిశా కార్మికురాలి మృతి

సుల్తానాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల-కదంబాపూర్ గ్రామాల సమీపంలో గల ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశా చెందిన లక్ష్మీగౌరి(35) అనే కార్మికురాలు మృతిచెందింది. ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రం దారమున్నా మండలానికి చెందిన ముకుందో గౌరి-లక్ష్మీ గౌరి అనే దంపతులు పదిహేను రోజుల క్రితం ఇటుక బట్టీలో పనిలో చేరారు. శనివారం మధ్యాహ్నం లక్ష్మీగౌరి బట్టీలో పని చేసిన అనంతరం అక్కడే ఉన్న స్నానాల స్థలం వద్ద కాలు జారి పడిపోయింది. దాంతో తలకు తీవ్ర గాయం కాగా సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించామని, కానీ పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయిందని నిర్ధారించారని తోటి కార్మికులు తెలిపారు.

మెడికల్ కళాశాలకు పార్థివదేహం దానం

- కార్మికుడి నేత్రాలతో ఇద్దరికి కంటి చూపు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నేత్రాదానంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాధించడంతో పాటు వైద్య కళాశాలకు శనివారం సింగరేణి మాజీ కార్మికుని మృతదేహాన్ని దానం చేసి సమాజం పట్ల బాధ్యతను చాటారు మృతుని కుటుంబ సభ్యులు. ఫైవింక్లయిన్‌కాలనీకి చెందిన దాసారపు మోహన్(59) అనే మాజీ సింగరేణి కార్మికుడు అనారోగ్య కారణాలతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. భర్తను కోల్పోయిన విషాదంలో ఉన్న సింగరేణి డిస్పెన్సరిలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న మృతుడి భార్య ఏవీ రమణ, కూతురు, అల్లుడు డాక్టర్ వినీషా, అవినాష్, కూతురు అశ్విని నేత్రదాన, అవయవదానం కోసం నిర్ణయం తీసుకున్నారు. సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మృతుని నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ సహకారంతో సేకరించారు. అలాగే వైద్య విద్య పరిశోధనకు మెహన్ పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు రామగుండం సిమ్స్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. పార్థివ దేహాన్ని స్వీకరించిన అనాటమీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన, టెక్నీషియన్లు లక్ష్మణ్ కుమార్, సిద్ధార్థ, తిరుపతితో పాటు కాలేజీ సిబ్బంది, కుటుంబ సభ్యులు, సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిదులు గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, యోగేష్, వెల్ది కవిత, అనంతరాములు, బోల్ల చంద్రశేఖర్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి నల్లవెల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల ముగింపు ఉత్సవాలు శనివారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో రెండు వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారని, వారి క్రీడా ప్రతిభను చాటుకున్నారని అన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేలా చేస్తారన్నారు. గతంలో క్రీడల పట్ల అంతగా ఆసక్తి చూపని వారు సైతం సీఎం రేవంత్ రెడ్డి క్రీడారంగానికి ఇస్తున్న ప్రోత్సహం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అసక్తి చూపుతున్నారన్నారు. ప్రతీ జిల్లా కేంద్రంలో నియోజకవర్గం కేంద్రాల్లో స్టేడియాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణించి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రెండు శాతం రిజర్వేషన్ వెసులుబాటు ఉంటుందని తద్వారా ప్రభుత్వ కొలువులు కూడా పొందవచ్చన్నారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని విజేతలు గా నిలిచిన క్రీడాకారులకు జట్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వై సురేష్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన లక్నో బృందం



విద్యార్థులను అభినందిస్తున్న లక్నో బృందం

ధర్మారం, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, గణిత సామర్థ్యాలను లక్నో అధ్యయన బృందం అభినందించింది. మండలంలోని రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలను లక్నో నుంచి వచ్చిన అధ్యాపక బృంద సభ్యులు ప్రవీణ్‌యాదవ్, అత్తర్‌సలీమ్‌లు శనివారం సందర్శించారు. అనంతరం వారు విద్యార్థులు తెలుగు, ఆంగ్లంలో చదవడం రాయడం, గణితంలో చతుర్విద ప్రక్రియలో ఎఫ్ఎల్ఎస్‌కు అనుగుణంగా విద్యార్థుల నుంచి ఆశించిన ఫలితాలు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థి సామర్థ్యాలను సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అభి నందించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్, మండల విద్యాధికారిణి పినమల్ల ఛాయదేవి, ప్రధానోపాధ్యాయులు వంశీ మోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్, ఏఎంసీ చైర్మన్ తాళ్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయంలో సీపీ తనిఖీలు



ఏసీపీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించడంతో పాటు ఏసీపీ ఆధ్వర్యంలో జరిగిన కేసుల దర్యాప్తు పురోగతి, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు తీరును ఏసీపీని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు, సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, నేరాల కట్టడికి సమిష్టిగా, సమన్వయంతో పని చేయాలన్నారు. చట్టాన్ని అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిని వదలవద్దన్నారు. తమ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ముందస్తు సమాచార సేకరణ అవసరమన్నారు. ఈ తనిఖీల్లో డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, మంథని సీఐ రాజు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో యోగా దినోత్సవం

కోల్‌సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హార్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజేషన్ వాలంటీర్లు రాంమోహన్ బండ, ఓం ప్రకాష్‌ల ఆధ్వర్యంలో మెడిటేషన్ శిక్షణను ఇచ్చారు. పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, ఇతర అధికారులు మెడిటేషన్ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యోగా అనేది ప్రాచీన భారతదేశంలో ఉద్భవించి ఆధ్యాత్మిక, భౌతిక అభ్యసమన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీనివాస్, సంపత్, మల్లేషం, సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, ఆర్ఎస్ఐ అనీల్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ పరిధిలో, కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన శనిగారపు మల్లయ్య (80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో మల్లయ్య ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో వేములవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మల్లయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మల్లయ్య మార్గమధ్యంలో మృతి చెందాడు. మల్లయ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీణవంక(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బండారి చేరాలు(55) అనే వ్యక్తి మృతి చెందాడు. చేరాలు తన ద్విచక్ర వాహనంపై బేతిగల్ వైపు వస్తున్న క్రమంలో ఓ కారు అతివేగంగా అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బండారి చేరాలుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య బండారి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ధర్మపురి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మామిడి రాజన్న (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న పెద్ద కొడుకు గణేశ్ మూడు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి రాజన్న మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై కొన్ని రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. చికిత్స కోసం కరీంనగర్ తరలించగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు రాజన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్ఫూర్తి



పవిత్ర తయారు చేసిన హెయిర్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా

తాను తయారు చేసిన హెయిర్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నాను చూపుతున్న పవిత్ర

ఆదాయ వనరుగా సహజ ఉత్పత్తులు

కొద్దిపాటి శిక్షణతో సహజ ఉత్పత్తుల తయారీని ఆదాయ వనరుగా మార్చుకున్నది మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల పవిత్ర. ప్రకృతిలో దొరికే పవ్వులు, ఆకులు, వేర్లతో హెయిల్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా తయారుచేస్తోంది. మొదట్లో వ్యాపారంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నా ధైర్యంగా వాటిని అధిగమించింది. ప్రస్తుతం తన ఉత్పత్తుల అమ్మకాల ద్వారా నెలకు పదివేల రూపాయల వరకు సంపాదిస్తోంది.

- కాల్వశ్రీరాంపూర్, ఆంధ్రజ్యోతి

- పువ్వులు, ఆకులు, వేర్లతో తయారీ
- డీఆర్‌డీఏ, ఐకేపీ సహకారంతో విక్రయాలు

స్వశక్తి సంఘంలోని పలువురు సభ్యులకు నాలుగేళ్ల క్రితం డీఆర్‌డీఏ, ఐకేపీ అధికారులు హెర్బల్ ఉత్పత్తుల తయారీపై హైదరా బాద్‌లో శిక్షణ ఇప్పించారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా ప్రకృతిలో దొరికే పవ్వులు, ఆకులు, వేర్లతో హెయిల్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా తయారీని నేర్పిం చారు. అలా శిక్షణ పొందిన స్వశక్తి సంఘ సభ్యురాలైన పల్లెర్ల పవిత్ర ఇంటివద్దనే వాటిన తయారు చేసి విక్రయిస్తూ ఆదాయం పొందుతోంది. 2019లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉత్పత్తుల తయారీలో వారం రోజులు శిక్షణ పొందారు. ఆరుగురు శిక్షణ పొందగా ఐదుగురు వివిధ కారణాలతో విరమించుకోగా, పల్లెర్ల పవిత్ర మాత్రం పట్టుదలతో కష్టనష్టాలకు ఓర్చి హెర్బల్ ఉత్పత్తులను తయారుచేసి కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, చొప్పదండి తదితర ప్రాంతాల్లోని దుకాణాల ద్వారా అమ్ముతోంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందిన తర్వాత స్వశక్తి గ్రూపులో రుణం తీసుకొని ఉత్పత్తుల తయారీ కొనసాగిస్తోంది.



సహజ ఉత్పత్తులను తయారు చేస్తున్న పవిత్ర

● నాలుగేళ్లుగా తయారీ..

ప్రకృతిలో దొరికే తులసి, మందార, కుంకుడుకాయ, అలోవేరా, వేపాకు, మర్రిఊడలు, గులాబీ, గోరింటా, గలిజేరు, తుంగగడ్డలు తదితర వాటిని తయారీకి వినియోగిస్తోంది. 2020 మార్చి 8 అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు అప్పటి కలెక్టర్ దేవసేన పవిత్ర తయారుచేసిన సున్నిపిండి, హెయిర్ ఆయిల్, షాంపూ, హెన్నాను డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతర పవిత్రను ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, పలువురు మహిళలు హెర్బల్ ఉత్పత్తులను కొనుగోలు చేశారని పవిత్ర తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే పూలు, చెట్లు, ఆకులు, వేర్లతో తయారు చేసే ఈ హెర్బల్ ఉత్పత్తులు వాడడం వలన ఎలాంటి హాని ఉండన్నారు. ఈ నాలుగు ఉత్పత్తులతో నెలకు పదివేల వరకు ఆదాయం వస్తోందని పవిత్ర పేర్కొన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా డీఆర్డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో తాను తయారుచేసిన ఉత్పత్తుల స్టాల్స్‌ను నాలుగేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్డీఏ, ఐకేపీ సహకారంతో హైదరాబాద్‌లోని శిల్పారామంలో కూడా స్టాల్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పవిత్ర తెలిపారు.



పవిత్ర తయారుచేసిన ఉత్పత్తులను ప్రారంభిస్తున్న కలెక్టర్ దేవసేన, ఇతర అధికారులు(ఫైల్)

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ దొంగిలించి అందులో ఉన్న సుమారు 5 వేల రుపాయలు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం నాయకులు బండారి తిరుపతిగౌడ్, శ్రీరాముల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆలయంలో ఉన్న ఆరు తులాల వెండి, కొంతమేర బంగారం చోరీకి గురైందని పెద్దపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు.

● ఓదెలలో..

ఓదెల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాపెల్లి రాజయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న రూ.20 వేలు నగదు, దాదాపు నాలుగు తులాల బంగారం చోరీకి పాల్పడినట్లు తెలిపారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రాజయ్య పేర్కొన్నారు.

గుప్త నిధుల పేరిట మోసం

● మహిళ వద్ద రెండేళ్లలో రూ.45లక్షలు వసూలు

మల్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం అత్యాశకు వెళ్లిన ఓ మహిళ మోసానికి గురై లక్షలాది రూపాయాలు పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొండగట్టుకు చెందిన ఓ మహిళ వద్దకు వచ్చిన ఓ సూర్యాపేట జిల్లాకు చెందిన లింగానాయక్ వాసిగా పరిచయం చేసుకున్నాడు. సదరు వ్యక్తి ఇక్కడి చుట్టుపక్కల ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయని మహిళను నమ్మించాడు. వాటిని పొందాలంటే పూజలు చేయించుకుంటే బంగారు బిళ్లలు తీసి ఇస్తానని చెప్పి రెండేళ్ల కాలంలో పలుమార్లు 45 లక్షల రూపాయల మేర వసూలు చేశాడు. ఇందులో భాగంగా కొండగట్టు సమీపంలోని ఓ చోట గుంత తవ్వి అందులో నుంచి కుండ తీసి దూరం నుంచే బంగారు బిళ్లలు చూపించాడు. వాటికి పూజలు చేసిన తరువాత ఇస్తా అని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి మోసపోయినట్లు గుర్తించిన మహిళ 15 రోజుల క్రితం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడు లింగానాయక్ పరారీలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.

పార్ట్‌టైమ్ జాబ్‌లు, ట్రేడింగ్ పేరుతో మోసం

- మంచిర్యాలలో గృహిణి నుంచి రూ.31.6లక్షలు కాజేసిన సైబర్ నేరస్థులు - కమీషన్లకు అకౌంట్లు అద్దెకు ఇచ్చిన వ్యక్తి అరెస్ట్

కోల్‌సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మంచిర్యాలకు చెందిన ఒక గృహిణిని సైబర్‌నేరగాళ్లు మోసగించి రూ.31.6లక్షలు కాజేశారు. ఈ ఏడాది అక్టోబరు 11న బాధితురాలు రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు నిందితుడు మహ్మద్ ఆవాజ్(21)ను శనివారం అరెస్టు చేశారు. మంచిర్యాలకు చెందిన ఒక గృహిణిని ఆన్‌లైన్ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ జాబ్‌ల పేర సైబర్ నేరస్థులు నమ్మించారు. ట్రేడింగ్‌లో లక్షలు వస్తాయని చెప్పడంతో సైబర్ నేరస్థులు చెప్పిన అకౌంట్‌లో డబ్బులు వేసుకుంటూ వెళ్లింది. అలా రూ.31,60,900 అకౌంట్‌లో వేసింది. తరువాత మోసపోయినట్లు గుర్తించి అక్టోబరు 21న రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డీఎస్పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సిబ్బంది కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. డబ్బులు డ్రా అయిన అకౌంట్ ఆధారంగా విచారణ జరుపగా హైదరాబాద్ మలక్‌పేటలో నిందితుడు మహ్మద్ ఆవాజ్(21)ని పట్టుకున్నారు. అతడు ఏసీ టెక్నీషియన్‌గా, ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తాను కేవలం అకౌంట్లు తన పేర తెరిచి ఇలియాజ్ అనే వ్యక్తికి ఇస్తానని, వారు సైబర్ నేరానికి పాల్పడి తన అకౌంట్‌లో డబ్బులు వేస్తారని, అలా తన అకౌంట్‌లో డబ్బులు పడినందుకు రూ.300 కమీషన్ ఇస్తారని తెలిపారు. తాను అలా మూడు అకౌంట్లు ఓపెన్ చేసి సైబర్ నేరస్థులకు ఇచ్చినట్టు విచారణలో తెలిపాడని, అతడిని అరెస్టుచేసినట్టు డీఎస్పీ తెలిపారు.



సైబర్ మోసం..

రూ. 9.80లక్షలు మాయం

గంగాధర(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసంతో 9.80 లక్షల రూపాయలు పోగొట్టుకున్న ఘటన గంగాధరలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలానికి చెందిన ఓ వ్యక్తికి గంగాధర మండలం మధురానగర్ యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. బ్యాంకు ఖాతాలో 9.83లక్షలు ఉండగా ఏటీఎంతో అవసరమున్నప్పుడు డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. ఏటీఎం కార్డు పోవడంతో కొత్తది తీసుకునేందుకు ఈ నెల 5న అతను బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ సిబ్బంది బ్యాంకు టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయమని తెలిపారు. అయితే బాధితుడు టోల్ ఫ్రీ నంబర్ తప్పుగా కొట్టడంతో ఎదుటి వ్యక్తి హిందీలో మాట్లాడి మరుసటి రోజున వోటీపీ వస్తుందని తెలిపారు. తిరిగి 6న అదే నంబర్ నుంచి ఫోన్ కాల్ చేసి వోటీపీ తెలుపమని చెప్పగానే బాధితుడు తెలిపాడు. ఇలా మూడుసార్లు వోటీపీ పంపి నంబర్ తెలుమని అనగానే బాధితుడు చెప్పగా ఖాతా నుంచి విడతల వారీగా రూ. 9.80 లక్షలు కొల్లగొట్టారు. ఈ నెల 10న బ్యాంకు ఖాతా బుక్కుతో డబ్బులు తీసుకుందామని వెళ్లి పరిశీలించగా ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకు సిబ్బంది తెలిపారు. లక్షల రూపాయలున్న ఖాతాలో డబ్బులు ఎలా మాయమయ్యాయని బాధితుడు ఆందోళన చెందాడు. సిబ్బంది పరిశీలించి ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతా కనిపించకపోవడంతో బాధితుడి సెల్ ను పరిశీలించారు. సెల్‌కు వచ్చిన వోటీపీ చెప్పానని తెలపడంతో సైబర్ మోసం జరిగినట్లు తెలిసింది. దీనిపై కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బులు మాయమై నాలుగు రోజులు గడిచినందున రికవరీ కష్టమని పోలీసులు తెలుపుతున్నారు. దీనిపై సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా బాధితుడు ఏటీఎం పోయిందని రాగా టోల్‌ఫ్రీకి కాల్‌చేయమనగా ఒక నంబర్ తప్పుగా కొట్టాడని, అది సైబర్ నేరగాళ్లకు వెళ్లి వోటీపీ చెప్పగానే పలుమార్లు ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు తెలిపారు. డ్రా చేస్తే దొరుకుతా మని సైబర్ నేరగాళ్లు వస్తువులను కొన్నట్లు తెలుస్తోందని తెలిపారు. బ్యాంకు పేరున వోటీపీ చెప్పమని ఎవరూ ఫోన్‌చేయరని, ఎవరైనా వోటీపీ చెప్పమని ఫోన్‌చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని బ్యాంకు మేనేజర్ సూచించారు.

అదుపు తప్పిన గ్రానైట్ లారీ

- ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ
- నిలిచిన విద్యుత్ సరఫరా



కిందపడిన గ్రానైట్ రాయి, తెగిన తీగలు

కొడిమ్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామ డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో వేములవాడ-జగిత్యాల ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. నల్లగొండ వైపు నుంచి గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ ఇంజన్ ట్రాలీ లింక్ ఊడిపోయి అదుపు తప్పింది. దీంతో ఇంజన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కొడిమ్యాల తహసీల్దార్ రమేష్, ట్రాన్స్‌కో ఏడీఈ ఆర్ మహేందర్, కొడిమ్యాల ఏఈ రఘునాథన్, పోలీసులు పరిశీలించారు. 100కేవీ, 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు విద్యుత్ పోల్లు దెబ్బతిన్నాయ్యారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివాహేతర సంబంధమే కారణం - వివరాలు వెల్లడించిన వేములవాడ ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న ఆగ్రహంతోనే నూనె మనోహర్ అనే వ్యక్తి రషీద్ అనే యువకుడిని హతమార్చినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన వేములవాడ పట్టణంలో రషీద్ అనే యువకుడిని వేటాడి వెంటాడి కత్తితో పొడిచి దారుణంగా హతమార్చిన ఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి శనివారం రాత్రి వేములవాడ రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వేముల వాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో నివాసం ఉండే నూనె మనోహర్ అనే వ్యక్తి జీవనోపాధి కోసం కొంతకాలంగా దుబాయిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనోహర్ భార్యతో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మహ మ్మద్ రషీద్(35) అనే యువకుడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం మనోహర్‌కు తెలిసింది. వివాహేతర సంబంధం విషయంలో గతంలో భార్యను మందలించగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. భార్య మరో ఇంట్లో నివాసం ఉంటూ వివాహేతర సంబంధాన్ని యథావిధిగా కొనసాగిస్తుండడంతో మనోహర్ తీవ్రఆగ్రహానికి లోనయ్యాడు. ఈ క్రమంలో మనోహర్ 45 రోజుల క్రితం దుబాయ్ నుంచి వేములవాడకు వచ్చాడు. భార్య వ్యవహార శైలితో ఎలాగైనా రషీద్ అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఈనెల 18వ తేదీన తెల్లవారుజామున అర్బన్ కాలనీ ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రషీద్‌పై కత్తితో పొడిచి చంపాడు. హత్యానంతరం పరారీలో ఉన్న నిందితుడు మనోహర్‌ను శనివారం మధ్యాహ్నం మల్లారం రోడ్డు ప్రాంతంలో అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు నిందితుడి పాస్‌పోర్ట్, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై మారుతి, పట్టణ ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శం

విత్తనం వేస్తే అవార్డుల పంటే



డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు మల్లారెడ్డి



మల్లారెడ్డి ఇంట్లో అవార్డులు

- డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగు
- పలు జిల్లాల రైతులకు సూచనలు ఇస్తున్న మల్లారెడ్డి
- ఉత్తమ రైతుగా అవార్డులు, సత్కారాలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయన విత్తనం వేస్తూ అవార్డుల పంట పండిస్తున్నాడు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ.. వేసిన రకాలు వేయకుండా నూతనంగా వచ్చే వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా వరి పంటను పండిస్తూ.. రాష్ట్రంలోని పలువురు రైతులకు మెళకువలను నేర్పించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాడు పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలంలోని కాసులపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి. అధిక దిగుబడి వచ్చే వరి విత్తనాలను తయారు చేసి జిల్లాతో పాటు పలు రాష్ట్రాల రైతులకు ఎగుమతి చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● డ్రమ్ సీడర్ పద్ధతితో సాగు చేస్తూ..

ఎర్రం మల్లారెడ్డి 2012 నుంచి తనకున్న 12 ఎకరాల్లో డ్రమ్ సీడర్ పద్ధతితో వరిపంటను సాగు చేస్తున్నారు. తనకున్న భూమిలో ఇప్పటివరకు వేసిన రకాలు వేయకుండా నూతనంగా వచ్చే వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తూ ఆర్థిక నష్టాలకు గురయ్యే రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే పలు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన రైతులకు కూడా డ్రమ్ సీడర్ ద్వారా పంట దిగుబడి వరి పంటలోని మెళకువలలో సలహాలిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు వేసిన పంటల రకాల్లో అధిక దిగుబడి వచ్చే వరి విత్తనాలను తయారు చేసి ప్యాకింగ్‌తో జిల్లాతో పాటు పలు రాష్ట్రాల రైతులకు ఎగుమతి చేస్తున్నారు. కొంతమంది రైతులు ఇదేం పద్ధతి అంటూ ఆశ్చర్యానికి గురైనా మల్లారెడ్డి మాత్రం డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరిపంటను సాగు చేసి ఔరా అనిపించారు. మల్లారెడ్డిని చూసిన రైతులు కొందరు కూలీల కొరతను నివారించేందుకు డ్రమ్ సీడర్ పద్ధతిని అవలంభిస్తూ పంటలను సాగు చేస్తున్నారు.

● ఇతర రాష్ట్రాలకు నూతన వంగడాలు

మల్లారెడ్డి తాను డ్రమ్ సీడర్ ద్వారా నూతన వంగడాలను సాగు చేస్తూ అందులో చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసి వాటిని రైతులకు అందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల రైతులకు నూతన వంగడాలను అందిస్తూ రైతులు అధిక దిగుబడి పొందేందుకు ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయాల పరిధిలోని ఆరు పరిశోధన కేంద్రాల నుంచి వివిధ రకాలైనా వరి విత్తనాలు తీసుకోచ్చి సాగుచేసి అభివృద్ధి చేస్తున్నారు. వరి వంగడాలతో పాటు కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించి అధిక దిగుబడిపై శ్రద్ధ వహించి పలువురికి సూచిస్తున్నారు.

● అన్నదాతలకు అండగా..

పెద్దపల్లి జిల్లా ఫార్మర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్‌గా మల్లారెడ్డి బాధ్యతలు తీసుకోన్ని అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. ఆర్గనైజేషన్‌లో సుమారు 300 మంది రైతులను భాగస్వాములను చేసి, అధిక దిగుబడి వచ్చే కురగాయల విత్తనాలు, వరి వంగడాలను రాయితీపై అన్నదాతలకు అందజేస్తున్నారు. వీటితో పాటు పంటలకు అందించే ఎరువులను అందించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఎర్రం మల్లారెడ్డి (ఫైల్)

● అవార్డులు.. సత్కారాలు

డ్రమ్ సీడర్ ద్వారా మల్లారెడ్డి నూతన వరి వంగడాలను సాగు చేస్తుండటంతో పంట పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నూతన వంగడాలను పండించడంతో పాటు సరికొత్త పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు వచ్చే వంగడాలను రైతులకు అందిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పలు అవార్డులు, సత్కారాలు అందించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, హైదరబాద్‌లో డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఒక్కరికి ఉత్తమ రైతు అవార్డు అందించగా పెద్దపల్లి జిల్లా కాసులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మల్లారెడ్డికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



జగిత్యాల లో తీసుకున్న అవార్డులతో మల్లారెడ్డి దంపతులు

రైతులు ఆనందంగా ఉండేందుకే

- ఎర్రం మల్లారెడ్డి, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, కాసులపల్లి



రైతులు సాగు చేస్తున్న పంటలపై అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలోని పరిశోధన కేంద్రాల నుంచి ప్రతీ ఏటా 10 రకాల వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసి నష్టం వాటిల్లని విత్తనాన్ని ఎంపిక చేస్తున్నాను. వీటిని సాగు చేయడం ద్వారా చీడ పీడలను తట్టుకోవడంతో పాటు పెట్టుబడి కూడా తగ్గుతున్నాయి. రైతులు నష్టపోకుండా లాభాల బాటలో నడుస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో మరింత ఉత్సాహం అనిపిస్తోంది.

'శాతవాహన' సమాచారం

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం పది మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో సెమిస్టర్‌లో అపూర్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, మూడో సెమిస్టర్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

పీజీ, ఎంసీఏ, ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వి శ్రీరంగ ప్రసాద్ శనివారం విడుదల చేశారు. ఈ పరీక్షలు జనవరి రెండో తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని వివరించారు.

టీజీవో సంఘం ప్రచార కార్యదర్శిగా సంతోష్



సంతోష్‌ను అభినందిస్తున్న నాయకులు

జగిత్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవో) సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జగిత్యాల జిల్లాకు చెందిన గంగుల సంతోష్ ఎంపికయ్యారు. శనివారం హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గంలో ప్రచార కార్యదర్శిగా గంగుల సంతోష్ కుమార్‌ను నియమిస్తూ టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సంతోష్‌కుమార్ నియమితులైన సందర్భంగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవి బాబు, కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కాళీచరణ్, రవీందర్, దేవానంద్ హర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ ఆఫీసర్ నియామకానికి నోటిఫికేషన్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంబీబీఎస్ విద్యార్హతతో హెచ్ఐవీ, ఎయిడ్స్ ఫీల్డ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత నివ్వనున్నట్టు సూపరింటెండెంట్ దయాల్ సింగ్ పేర్కొన్నారు. 70 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. నెలకు రూ.72వేల వేతనం ఉంటుందని, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎడారి దారిలో.. వేములకుర్తి

ఐదు దశాబ్ధాల క్రితం ఆ గ్రామం గల్ఫ్ బాట పట్టింది. తండ్రి మొదలుకొని ఇప్పుడున్న కొడుకులు, యువత అదే బాటలో పయణించి ఆర్థికంగా ఎదిగారు. గల్ఫ్ వలసలకు కేరాఫ్‌గా వేములకుర్తి నిలుస్తోంది. గ్రామంలో ఐదు వేలు పై చిలుకు జనాభా ఉండగా దాదాపుగా 800 మంది గల్ఫ్‌లోనే స్థిరపడ్డారు. విదేశీ వలసల వల్ల గ్రామానికి యేటా సుమారు రూ. 15 కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తోంది. వలసల కారణంగా గ్రామంలో అధికంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులే కని పిస్తుంటారు. స్వయం ఉపాధి పొందుతున్న యువకులు, ఉద్యోగస్థులు, వ్యవసాయం జోరుగా చేస్తున్న వ్యక్తులు మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. మిగిలిన వారంతా దాదాపుగా విదేశాల్లోనే ఉపాధి చూసుకుని అక్కడే ఉంటున్నారు.



- ఐదు దశాబ్ధాలుగా గల్ఫ్ బాటలో
- విదేశాల్లో కంపెనీలు స్థాపించి అక్కడే స్థిర జీవనం
- గ్రామానికి యేటా సుమారు రూ. 15కోట్ల విదేశీ మారకద్రవ్యం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల మధ్య గల గోదావరి తీర ప్రాంతమైన ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామం విదేశీ వలసలకు నిలయంగా మారింది. సుమారు ఐదు దశాబ్ధాలుగా గ్రామానికి చెందిన యువత విదేశాలకు వెళ్లి వస్తున్నారు. ఉన్న ఊర్లో ఉపాధి అంతంతమాత్రంగానే ఉండడంతో యువత ఎడారి బాట పడుతున్నారు. గ్రామంలో దాదాపుగా ఇంటికి ఒకరు చొప్పున గల్ఫ్ దేశాల్లో ఉపాధి చూసుకుని అక్కడే ఉంటున్నారు. గల్ఫ్ దేశాలతో వేములకుర్తి వాసులకు ఎక్కువగా రాకపోకల సంబంధాలు ఉంటున్నాయి. ప్రధానంగా మస్కట్, అబుదాబి, బెహరన్, ఓమన్, దుబాయి, ఖతార్ తదితర దేశాలకు వలస వెళ్లి వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు.

● సొంత కంపెనీల ఏర్పాటు....

వేములకుర్తి నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన పలువురు గ్రామస్థులు అక్కడ సొంత కంపెనీలు ఏర్పాటు చేసుకొని ఇతరులకు సైతం పనికల్పించే స్థితికి ఎదిగారు. కొందరు సొంత వ్యాపారాలు నిర్వహిస్తుండగా, మరికొందరు పలు సాఫ్ట్‌వేర్, కన్ స్ట్రక్షన్ కంపెనీలను నెలకొల్పి ఇతరులకు ఉపాధి చూపుతున్నారు. వేములకుర్తికి చెందిన సుమారు పది కుటుంబాలు గల్ఫ్‌లో కంపెనీలు నెలకొల్పి స్థిరపడ్డాయి. పలువురు యు వకులు వివిధ కంపెనీల్లో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ట్రావెలింగ్ ఏజంట్, లేబర్, స్టీల్ ఫిట్టర్, ట్రేడర్స్, స్టోర్ కీపర్‌గా, పెట్రోలు బాయ్‌గా, మున్సిపల్ వర్కర్‌గా, సినిమాహాళ్లు, హోట ళ్లలో పనిచేస్తున్నారు. వేములకుర్తికి చెందిన ప్రవాస భారతీయుల సహకారాలతో గ్రా మంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి.

● గల్ఫ్‌లో 800 మంది....

వేములకుర్తి గ్రామం నుంచి ప్రస్తుతం సుమారు 800 మంది వరకు గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. కొందరు ప్రొఫెషనల్ పనులు చేస్తుండగా, మరికొందరు కార్మికులుగా ప నిచేస్తున్నారు. అర్హత, అనుభవం, అవకాశాలను బట్టి గల్ఫ్ దేశాల్లో వివిధ రంగాల్లో వేములకుర్తి వాసులు ఉన్నారు. అక్కడ సంపాదించిన సొమ్మును ఖర్చులు పోను పలు సందర్భాల్లో సొంత గ్రామంలోని తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు పంపుతుం టుంటారు. ఒక్కొక్కరు నెలకు భారత కరెన్సీ విలువ ప్రకారం సుమారు రూ. 25 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు సంపాదిస్తున్నారు. దీంతో నెలకు సగటున సుమారు రూ. కోటిన్నర వరకు కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తోంది. యేటా సుమారు రూ. 15 కోట్ల వ రకు ఉంటుందన్న అంచనాలున్నాయి. గ్రామంలో అధిక లావాదేవిలు జరుగడంతో విరి సౌకర్యార్థం ఓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను గ్రామంలో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.


వేములకుర్తి గ్రామ స్వాగత తోరణం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు జలాభిషేకం చేస్తున్న గల్ఫ్ మిత్రులు

వ్యవసాయంపై ఆధారపడి జీవించేవాళ్లం

-అల్లకొండ గంగాధర్, వేములకుర్తి



నేను 1986 సంవత్సరంలో దుబాయి వెళ్లాను. అప్పుడు మా గ్రామం నుంచి కొత్తగా దుబాయి వెళ్లాం. దుబాయి వెళ్లి బిల్డింగ్ పనులు చేసి ఉపాధి పొందాము. నెలకు అక్కడ ఇండియా కరెన్సీ ప్రకారం 14 వేల జీతం తీసుకునేవాడిని. అక్కడ కొన్ని ఖర్చులకు ఉంచుకుని మిగిలిన డబ్బులను ఇంటికి పంపేవాళ్లం. నేను అంతకు ముందు ఊళ్లో వ్యవసాయం, గీత కార్మికుడికి కల్లు అమ్ముకుంటూ ఉపాధి పొందేవాడిని. సొంత ఊళ్లో పని చేసినప్పుడు పొట్ట, బట్ట మందం మాత్రమే సంపాదించేవాడిని. గల్ఫ్ వెళ్లిన తర్వాతనే ఆర్థికంగా ఎదిగాను. 1986 కంటే ముందు గ్రామంలో అందరు వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు కాలం గడిపేవాళ్లం. కానీ గ్రామం నుంచి ఒక్కొక్కరుగా గల్ఫ్ బాట పట్టడంతో గ్రామస్థులందరూ ఆర్థికంగా ఎదిగారు. అప్పుడు చిన్న చిన్న పెంకుటిళ్లు ఉండేవి. ఇప్పుడు ప్రతీ ఒక్కరు పెద్ద పెద్ద భవంతులు సొతూళ్లలో నిర్మించుకున్నారు. విలాసవంతమైన జీవితనం గడుపుతున్నారు. గ్రామంలో ఒక్కప్పుడు బిజినెస్‌లు అనేవి లేకుండే. ఇప్పుడు పదుల సంఖ్యలో కోళ్ల ఫాంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక లావాదేవీలు జరగడంతో బ్యాంక్‌లు ఏర్పడ్డాయి. పెద్ద పెద్ద వావానాలు కొనుగోలు చేసి వేరే రాష్ట్రాలలో బిజినెస్‌లు చేస్తున్నారు.

ఉపాధి నిమిత్తం ఎడారి బాట పట్టాం

- ఆడ్వల రాము, వేములకుర్తి



ఉన్న ఊర్లో ఆశించిన ఉపాధి దొరకక పోవడం వల్ల ఏడారి బాట పట్టాం. సింగపూర్ దేశంలో ఓ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌గా పని చేశాను. 1.5 లక్షల రూపాయలు జీతం తీసుకున్నాను. ప్రస్తుతం గ్రామం తిరిగి వచ్చి సొంతంగా కోళ్ల ఫారం పెట్టుకున్నాను.

పాతికేళ్లుగా గల్ఫ్‌లో ట్రావెలింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్నా..

- చింత రాజమల్లు, వేములకుర్తి



సుమారు గత పాతికేళ్లగా వేములకుర్తిలో ట్రావెలింగ్ ఏజన్సీతో పాటు ఓ చిన్న కంపెనీ నెలకొల్పాను. అప్పుడప్పుడు వేములకుర్తికి వచ్చి వెళ్తుంటాను. గ్రామం నుంచి గల్ఫ్ దేశాల్లో అధిక సంఖ్యలో యువత పనిచేస్తున్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడం కారణంగా వలసలు జరుగుతున్నాయి.

యోగాతో మానసిక వికాసం

- యోగా అసోసియేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక వికాసం కలుగుతుందని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి యోగా, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలను, పతకాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగాలో శిక్షణ పొందితే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ యోగా క్రీడాకారులు తిరుగులేని పతకాలను సాధిస్తూ జాతీయ స్థాయిలో విజయాలను పొందుతున్నారన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో సీఎంకప్ జిల్లాస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఉదయం యోగా, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను డీవైఎస్‌వో అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబు శ్రీనివాస్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు అంతడ్పుల శ్రీనివాస్, సొల్లు సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అంతటి శంకరయ్య, పోతన శ్రీనివాస్, వంగపల్లి సూర్యప్రకాశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు పతకాలను అందజేస్తున్న రవీందర్‌సింగ్


యోగాసనాలు వేస్తున్న బాలికలు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కోనరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పూజిత రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైనట్లు ఎంఈవో మురళి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పూజిత ఈనెల 22 నుంచి 25 వరకు మేడ్చల్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైందని వివరించారు. కాగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థిని శనివారం అభినందించారు.

రాజన్నను దర్శించుకున్న డైరెక్టర్ వంశీ పైడిపల్లి



డైరెక్టర్ వంశీకి రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ డైరెక్టర్ వంశీ పైడిపల్లి శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న వంశీ పైడిపల్లికి బీఆర్‌ఎస్ సీనియర్ నేత, వేములవాడ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి స్వాగ తం పలికారు. రాజన్న ఆలయంలోకి చేరుకున్న వంశీ కోడెమొక్కు చెల్లించుకు ని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం రాజన్న ఆలయ అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఏనుగు తిరుపతిరెడ్డి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: సినిమా దర్శకుడు వంశీ పైడిపల్లి శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డితో పాటు కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, రాజు ఉన్నారు.

'కేథడ్రల్‌రాక్' పై 108 సూర్య నమస్కారాలు


పర్వతంపై సూర్య నమస్కారాలు చేస్తున్న ప్రవీణ్

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన మరిపెల్లి ప్రవీణ్ అమెరికాలోని అరిజోనా రాష్ట్రం సెడోనా సమీపంలోని కేథడ్రల్ రాక్ పర్వతాన్ని అధిరోహించాడు. ప్రవీణ్ ఈనెల 20న సముద్ర మట్టానికి 4900 అడుగుల ఎత్తులోని రాతి పర్వతాన్ని అధిరోహించి 22 నిమిషాలలో 108 సూర్య నమస్కారాలు చేసినట్లు ఆయన తెలిపాడు. ప్రవీణ్ ఇప్పటికి అతి తక్కువ ఉష్ణోగ్రతలలోని ఎత్తయిన 49 పర్వతాలు అధిరోహించాడు. వాటిపై 108 సూర్య నమస్కారాలు చేస్తూ యోగా శక్తిని ప్రపంచానికి చాటిచెబుతున్నాడు.

మహిళలకు 'భరోసా'

- బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం
- కొత్తపల్లిలో నేడు కేంద్రాన్ని ప్రారంభించనున్న డీజీపీ
- రూ.1.70 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మాణం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం చూపుతూ, వారికి భద్రత కల్పించేందుకు కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో పోలీసుశాఖ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కమిసనరేట్‌లోని పోలీసు ఠాణాల్లో నమోదైన మహిళలు, బాలికలకు సంబంధించిన కేసుల్లో బాధితుల వాంగ్మూలం రికార్డు చేయటం, కోర్టులో హాజరుపరచటం, మెజిస్ట్రేట్‌తో వాంగ్మూలనం రికార్డు చేయించటం, కౌన్సెలింగ్ వంటివి ఈ భరోసా కేంద్రంలో జరుగనున్నాయి. ఆదివారం డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) జితేంద్ర కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. కమిషనరేట్ కేంద్రంలో నిర్మించిన ఫంక్షన్‌హాల్, కేఫ్‌లను ఆయన ప్రారంభోత్సవం చేయనున్నారు. 2022 డిసెంబరు 17న ఈ భరోసా కేంద్రానికి శంకుస్థాపన జరగగా కోటి 70 లక్షల రూపాయల నిధులతో 13 గుంటల స్థలంలో అత్యంత ఆధునిక వసతులతో ఈ భవనం నిర్మాణం పూర్తి చేశారు. ఈకేంద్రంలో చైల్డ్ అండ్ ఉమెన్ ప్రొటెక్షన్, అత్యాచారం, పోక్సో కేసుల విచారణ జరుపుతారు. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయ సహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురైన, ఆపదలో ఉన్న మహిళలకు వైద్య చికిత్సలు, కౌన్సెలింగ్, భద్రత, న్యాయసహాయాన్ని అందించేందుకు ప్రత్యేకంగా జిల్లాకు ఒకటి భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పనిచేసేందుకు కాంటాక్ట్ ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు కోరుతూ పోలీస్ కమిషనర్ ఇటీవల నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నడిచే ఈ భరోసా కేంద్రానికి ఏసీపీ మాధవి ఇన్‌చార్జిగా ఉన్నారు. ప్రస్తుతం ఈ భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సెలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎన్ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్ని రకాల సమాచారంతో పాటు సహాయాన్ని అందిస్తారు.



కొత్తపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన భరోసా కేంద్రం

కమిషనరేట్‌లో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. ఏడాదిలో 500పైగా మహిళలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. ఇందులో అత్యాచారాలు, వేధింపులు, పోక్సో కేసులకు సంబంధించిన బాధితుల్లో మహిళలు, యువతులు, బాలికలు ఉన్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాల కట్టడి, కేసుల నమోదు, కౌన్సెలింగ్ ఇవ్వటం, బాధితులకు న్యాయ సహాయం అందించడం, ఎన్ఆర్ఐ భర్తల కేసుల్లో సహాయం అందించడం, మహిళలను వేధించే పోకిరీలకు చెక్‌పెట్టడం, సైబర్ నేరాలపై మహిళలకు భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తారు. మహిళా బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, లైంగిక, ఇతర రకమైన వేధింపులు, నేర ఘటనల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి తదితర విషయాల్లో ఈ భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పించనున్నారు.

కమిషనరేట్‌లో కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించనున్న డీజీపీ

కమిషనరేట్ కేంద్రంలో దశాబ్దాల కిందట నిర్మించిన జాన్‌విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ప్రస్తుతం పోలీస్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని కన్వెన్షన్ సెంటర్‌గా పునర్నిర్మాణం చేయించారు. దీన్ని డీజీపీ ప్రారంభించనున్నారు. దీనిలో పోలీసు కుటుంబాలలో పెళ్లిళ్లకు కొంత రాయితీ ఇస్తూ ఇతరులకు కూడా ఇందులో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. చాకలి ఐలమ్మ జంక్షన్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో రోడ్డువైపున ఒక కేఫ్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు కూడా డీజీపీ ప్రారంభించనున్నారు.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు


- విజేతలుగా రాజన్న సిరిసిల్ల , కరీంనగర్ జిల్లా జట్లు




విజయం సాధించిన కరీంనగర్ జిల్లా మహిళల జట్టుతో అతిథులు, తలపడుతున్న వాలీబాల్ జట్లు

సిరిసిల్ల టౌన్/కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజన్న సిరిసిల్ల పురుషుల జట్టు, కరీంనగర్ మహిళ జట్టు విజయం సాధించాయి. శనివారం జిల్లా యువజన, కీడాశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం మినీస్టేడియంలో సీఎం కప్-2024 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల, కరీనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా పురుషుల నాలుగు జట్లు, మహిళ నాలుగు జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో, జగిత్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు ట్రోఫీలతో పాటు వ్యక్తిగతంగా స్వర్ణం, సిల్వర్ మెడల్స్‌ను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి అందించి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జగిత్యాల వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు సుదీర్‌రావు, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గుడ్ల రవి, కోశాధికారి కోడం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, వాలీబాల్ అకాడమి కోచ్‌లు సంపత్, జగన్, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ జట్ల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అసౌకర్యంగా వసతి గృహాలు



ఓదెల బీసీ బాలికల హాస్టల్‌లో తలుపు లేని కిటికీకి అడ్డుగా వేసిన బ్లాంకెట్..

(5వ పేజీ తరువాయి)

వీటిలో 1466 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి వేళలో రెండు దఫాలుగా జిల్లాలో గల వసతిగృహాలను 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

అసౌకర్యాలతో సహవాసం..

సుల్తానాబాద్‌లోని బీసీ హాస్టల్‌లో బాతురూములకు డోర్లు సరిగా లేక, బెడ్లు ఉన్నా పరుపులు లేక కిందనే పడుకుంటూ చలికి ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సా బాలుర కళాశాల హాస్టల్ అధ్వానంగా ఉంది. గదులు, కిటికీలు సరిగా లేవు. చెదలు పట్టడంతో నేల రంధ్రాలు పడడంతో విష పురుగులతో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు 8 ఉంటే 6 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. కాల్వశ్రీరాంపూర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేసినా బాత్‌రూముల డోర్లు సరిగా అవస్థలు పడుతున్నారు. గోదావరిఖనిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేవు, బీసీ బాలుర హాస్టల్‌లో బాతురూములకు తలుపులు సక్రమంగా లేవు. బీసీ బాలికల హాస్టల్‌లోని కొన్ని కిటికీలకు తలుపులు విరిగి పోయి ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఓదెలలో బీసీ బాలికల హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకున్నారు. అవి సరిపోక చలికి గజగజ వణుకుతున్నారు. బాలుర హాస్టల్‌లో బెడ్లు లేక కిందనే నిద్రిస్తున్నారు. డైనింగ్ కూడా సరిగా లేదు. పాలకుర్తి మండలం జయ్యారం హాస్టల్‌లో డైనింగ్ టేబుళ్లు బయట వేశారు. జూలిపల్లి బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థుకు బెడ్లు లేక విద్యార్థులు నేల మీదనే నిద్రిస్తున్నారు. ధర్మారం మండలం నందిమేడారం ఎస్సీ బాలుర హాస్టల్‌లో కిటికీల తలుపులు విరిగిపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. మంథనిలలోని పలు హాస్టళ్లలో మరుగుదొడ్లు సక్రమంగా లేక, కిటికీలకు తలుపులు సరిగ్గా లేకపోవడం, పరిసరాలు, కిచెన్లు అపరిశుభ్రంగా ఉన్న కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, వార్డెన్లు రెగ్యులర్ రావడంతో అవస్థలు పడుతున్నారు. మొత్తం 31 హాస్టళ్లకు పదింటికి సొంత భవనాలు లేక, సొంత భవనాల కు మరమ్మతులు లేక అసౌకర్యంగా మారాయి.

అద్దె భవనాల్లో..

పెద్దపల్లి కల్చరల్ : జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ బాల బాలికల హాస్టల్‌తోపాటు ఇంటిగ్రే టెడ్ హాస్టల్ ఉన్నాయి. ఎస్టీలకు మాత్రం ఇక్కడ లేకుండా పోయింది. మొత్తం 14 వసతి గృహాలు ఉండగా, 9ఎస్సీ, బీసీ హాస్టళ్లు ప్రభుత్వ భవనా ల్లో కొనసాగుతున్నాయి. బీసీ హాస్టల్స్ లో ఒక హాస్టల్‌లో 40 మంది మరొక హాస్టల్లో 80మంది ఉన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 140మంది ఉన్నారు మరొక ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్లో 40మంది ఉన్నారు. ఇంటిగ్రేటెడ్, గురుకుల వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.



జిల్లా కేంద్రంలోని ఓ హాస్టల్‌లో..

మరమ్మతులు కరువు..

సుల్తానాబాద్ : సాంఘీక సంక్షేమ శాఖ కాలేజీ హాస్టల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. గదుల్లో కిటికీలకు తలుపులు లేక చలి రాకుండా దుస్తులు, అట్టలు అడ్డుగా పెట్టుకున్నారు. హాస్టల్ లోపల ఆవరణలోకి తరచూ విషపురుగులు వస్తున్నాయి. బాలికల సంక్షేమ హాస్టల్‌లో ఒక్కో గదిలో ఎనిమిది మంది చొప్పున ఉంటున్నారు. కిటికీలకు తలుపులు లేవు. బీసీ బాలుర హాస్టల్‌లో వేడి నీటి సౌకర్యం లేదు. దీంతో చలిలోనూ బోరు, నల్లా నీటితో స్నానం చేస్తున్నారు.



ఎస్సీ కాలేజీ హాస్టల్‌లో మూసి ఉన్న మూత్రశాలలు

అసౌకర్యాలకు నిలయంగా..



బాలికల హాస్టల్ విద్యార్థినులు ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు

ఓదెల : మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో ఆరు స్నానాల గదులున్నప్పటికీ ఒకటి ఉపయోగం లేకుండా పోయింది. విద్యార్థులకు బెడ్స్ లేక కిందనే నిద్రిస్తున్నారు. కిటికీలకు తలుపులు లేక చలిలో ఇబ్బందులకు గురవుతున్నారు. డైనింగ్ టేబుళ్లు లేవు. బాలికల హాస్టల్‌లో దుప్పట్లు ఇవ్వడం లేదు. ఇళ్ల నుంచి తెచ్చుకున్న దుప్పట్లను వినియోగించుకుంటున్నారు.

ఇరుకు గదిలో..



మంథని బీసీ కాలేజ్ హాస్టల్‌లో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

మంథని : సాంఘిక సంక్షేమ శాఖ బాలికల, బీసీ బాలుర, బాలికల కాలేజీ హాస్టళ్లు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. భోజనం కొంత నాణ్యత లోపం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. సరిపడా సిబ్బంది లేని కారణంగా కొంత అపరిశుభ్రంగా ఉంటున్నాయి. మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్స్ మాత్రమే ఉన్నారు. ఈ కారణంగా విద్యార్థులపై సరైన పర్యవేక్షణ, రక్షణ లేకుండా పోతోంది.

న్యూస్ బాక్స్

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి అమలు చేయడం లేదని వెంటనే వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంచిర్యాల పిఆర్‌టియూ మాజీ జిల్లా అధ్యక్షులు ఇన్నారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారి సమ్మెకు ఇన్నారెడ్డి సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. జాక్ అధ్యక్షులు తిప్పని తిరుపతి, రాష్ట్ర నాయకులు కుంభాల సుధాకర్, కేజీబీవి రాష్ట్ర నాయకులు పుల్లూరి సంధ్యారాణి , రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

సుల్తానాబాద్, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): పోషక విలువలతో కూడుకున్న ఆహారం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని గర్రెపల్లి ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం కవిత సూచించారు.మండలంలోని ఐతరాజుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనలను హెచ్‌ఎం కవిత ప్రారంభించి తిలకించారు. ఐతరాజుపల్లి పాఠశాల ఉపాధ్యాయులు సమకూర్చుకున్న ఇరవై ఐదే వేల రూపాయలతో డ్యుయల్ బెంచీలను ప్రారంభించారు.

విద్యార్థులకు నగదు అందజేత

పాలకుర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు ఈర్ల శోభారాణి శనివారం నగదును అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత ఏడాది పాఠశాలలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు గతంలో ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన కీ.శే పనగంటి సదాశివ ఉన్న సమయంలో ఆయన పేరు మీద బ్యాంకులో కొంత నగదును డిపాజిట్ చేశారని, నగదు వడ్డీని సదాశివ కుటుంబసభ్యుల కోరిక మేరకు బహుమతిగా అందించామన్నారు.

పాలకుర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహంలో వసతి పొందుతున్న విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం పంపిణీ చేసిన ట్రంకు బాక్సులు, బూట్లను సంక్షేమ అధికారి మెండె సంపత్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అందించారు.

టీచర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి ఉన్నత పాఠశాల(సెక్టర్3)లో ఇంగ్లీష టీచర్(అడ్‌హక్) పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. బీఏ, ఎంఏ ఇంగ్లీష, బీఈడీ అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష టీచరు కోసం అర్హులైనవారు ఈ నెల 30లోగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సర్టిఫికెట్లు జారీ చేయవద్దు

కోల్‌సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థులకు ఎస్‌సీ సర్టిఫికెట్లు జారీ చేయవద్దని, అన్యమస్థులకు జారీ చేసిన ఎస్‌సీ సర్టిఫికెట్లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్‌సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు గోదావరిఖనికి చెందిన ఉదయ్ కుమార్ అనే వ్యక్తి విన్నవించాడు. శనివారం స్థానిక జీఎం కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన వడ్డేపల్లి రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. నిజమైన ఎస్‌సీలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గణిత ఉపాధ్యాయులు దేశ సంపదకు మూలం

ఓదెల, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బోధనతోనే ప్రపంచంలోనే మేధావి వర్గం పాలిస్తుందని, గణిత శాస్త్ర ఉపాధ్యాయులే దేశ సంపదకు మూలమని ఎంఈఓ రమేష్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా, శనివారం పొత్కపల్లి హైస్కూల్‌లో సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు గణిత మోడల్స్ ప్రదర్శన, గణిత రంగోలి, క్విజ్, నృత్యాల ప్రదర్శన నిర్వహించారు. పేరెంట్స్ , టీచర్స్ సమావేశం సందర్భంగా అలాగే ఆహార వారోత్సవాల్లో భాగంగా హాజరైన తల్లిదండ్రులు తీసుకువచ్చిన రుచికరమైన వంటకాలను విద్యార్థులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, గణితశాస్త్ర ఉపాధ్యాయులు జైపాల్ రెడ్డి, రామకృష్ణ, ఇతర ఉపాధ్యాయులు భద్రయ్య, శ్రీనివాస్, రఘుపతి, అమృత కిషోర్, రవీందర్, పద్మావతి, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.



పొత్కపల్లి హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎం.ఈ.ఓ రమేష్, ఉపాధ్యాయులు

● మంథని: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలతోపాటు పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని, ఆహారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంలు సుమలత, శ్రీనివాస్, ఉపాధ్యాయులు గీట్ల భరత్‌రెడ్డి, పరంజ్యోతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ : గణితాన్ని చూసి విద్యార్థులు భయపడితే రాదని, భయాన్ని వీడి సులభమైన పద్ధతిలో నేర్చుకుంటే వస్తుందని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ఫుడ్‌ఫెస్ట్ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. రాజాపూర్ ప్రాథమిక పాఠశాలలోపేరెంట్స్-టీచర్స్ మీటింగ్ జరిగింది. విద్యార్థుల పురోగతిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్య అర్చకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిట్టూరి అంబరీష్‌శర్మ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మంత్రికి వినతిపత్రం అందించినవారు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, కోశాధికారి సువర్ణ రాజేందర్‌శర్మ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కమాన్‌పూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగడి బజారు కేంద్రంలో శనివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మచ్చ గిరాము ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌ఎస్‌పీ రెడ్డి, గజవెల్లి గణేష్, బీజేపీ మండలాధ్యక్షుడు జంగంపల్లి అజయ్, జంగపల్లి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కమాన్‌పూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుడారు. సమావేశంలో మంథని మధు, కుక్క రవి, సంతోష్, ఓదెలు, మాజీ సర్పంచ్ పిడుగు నరసయ్య, దేవయ్యలు ఉన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు సింగరేణి అధికారి బైద్య, ఫాస్టర్ రాయపరెడ్డి మాట్లాడారు. ప్రపంచానికి ఏసుక్రీస్తు శాంతిని ప్రబోధించారన్నారు. చిన్నారులు ఏసుక్రీస్తు జననం వేషధారణలతో చేసిన నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియ గోరేటి, ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి, టికలా, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ఆఫీస్ ఇంచార్జీ విజయ, పద్మజ, ఉష, టీచర్లు, పాల్గొన్నారు.



పాఠశాలలో నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

● పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పండ్లు అందించారు. చలి తీవ్రమవుతున్న నేపథ్యంలో సోమగూడెం ప్రాంతానికి చెందిన అరేపల్లి డేవిడ్ సౌజన్యంతో దుప్పట్లను అందించారు. సామాజిక కార్యకర్త పల్లె శాంతి రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ఈదునూరి రమేష్ పులిపాక అబ్రహం, ఆశ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● జ్యోతినగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ పీటీఎస్‌లోని సెయింట్ క్లేర్ పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. క్రైస్తవ భక్తి గీతాలపై చిన్నారులు నృత్యం చేసి సందడి చేశారు. శాంటాక్రాస్ వేషధాణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ ఏజీఎం (సీ అండ్ ఐ, ఎరక్షన్) నోయ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ డోమినిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పోటీకి మహిళలు ఆసక్తి చూపాలి

సుల్తానాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదురుకొనేందుకు కార్యకర్తలు నాయకులు సిద్ధంగా ఉండాలని, ఇదే సందర్భంలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు మహిళలకు ముందుకు రావాలిన బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఆరుముళ్ళ పోచం అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో శనివారం బూత్ కమిటీ అధ్యక్షుల నియామక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా పోచం మాట్లాడుతు ప్రతీ మూడు సంవత్సరాలకోమారు ప్రజాస్వామ్య బద్ధంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఇపుడు ప్రతీ బూత్ కమిటీ నుంచి అధ్యక్షుల నియామకం చేస్తున్నామని చెప్పారు. శనివారం 202 బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం పూర్తిచేసి పత్రాలు అందజేశామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, జిల్లా సభ్యత్వ ఇంచార్జి పొల్సాని సంపత్ రావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్ఎన్‌సీ వనజ, పట్టణ అధ్యక్షురాలు కూకట్ల చంద్రకళ, ఎనగందుల సతీష్, పవన్ పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న నాయకులు

వీధి దీపాలు ఏర్పాటుచేయాలి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకల్వల నుంచి పెద్దబొంకూరు వెళ్లే ప్రధాన రహదారిపై రాత్రి వేళల్లో కొండచిలువలు దర్శనమిస్తున్నాయని, రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిమార్లు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి సమయంలో పెద్దబొంకూరు గ్రామానికి రోడ్డు ద్వారా వెళ్తుండగా పాదచారులు కొండచిలువను చూసి భయాందోళనలకు గురయ్యారు. వీధి దీపాలు లేకపోవడంతో పాములు, తేళ్లు, విషపురుగులు వస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం..

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒత్తిడి నుంచి దూరం చేసే శక్తి కేవలం ధ్యానంకు మాత్రమే ఉందని ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటీ బీఈడీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ జ్ఞాన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ఒక ప్రత్యేకత ఉందని అందులో ధ్యానము, ప్రాణాయామము, సూర్య నమస్కారాలు శారీరక, మానసిక శక్తికి ఉపయోగపడతాయని. బీఈడీ ఛాత్రోపాధ్యాయులకు శిక్షణకాలంలో దీనిని ఒక సబ్జెక్టుగా పేర్కొనడం వెనక ప్రధాన ఉద్దేశం అదేనని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ బుర్ర తిరుపతి, హరి, దిలీప్ శర్మ, మధుకర్, పి తిరుపతి, రమేష్, సుజాత, అనురాధ, జ్యోతి, సునిత, శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి మనోహర్ రెడ్డి



మహిళలకు ఆటల పోటీలు

గోదావరిఖని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా మహిళలకు, ఉద్యోగినులకు శనివారం స్థానిక జీఎం కాలనీ మైదానంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. బాల్ ఇన్ ద బాస్కెట్, బాంబ్ ఇన్ ది సిటీ, లెమన్ స్పూన్‌రన్, గ్లాస్ పిరమిడ్, పిల్లలు యువతులకు, మహిళలకు రన్నింగ్ రేస్ బెలూన్‌బ్లాస్ట్ తదితర పోటీలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారికి సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా సెక్రెటరీ శిరీష, సేవా జాయింట్ సెక్రెటరీ బీన సింగ్, చిలుక లక్ష్మి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేష్, కోఆర్డినేటర్ మేడి తిరుపతి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ గృహాలంకరణ పోటీలు

రామగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో ఉత్తమ గృహాలంకరణ ఎంపిక పోటీల్లో భాగంగా శనివారం ఎంపిక కమిటీ అధికారుల బృందం పర్యటించింది. ఉత్తమ గృహాల ఎంపిక ప్రక్రియలో విద్యుత్ పొదుపు వాడకం, మొక్కల పెంపకం, గృహాల శుభ్రత తదితర అంశాల ఆధారంగా ఉత్తమ గృహాల ఎంపిక చేపడుతున్నారు. కమిటీ కన్వీనర్‌గా ఎస్‌వోటూ జీఎం రఘుపతి వ్యవహరిస్తుండగా సభ్యులుగా(అధికారులు) రాజారెడ్డి, రాజేంద్రకుమార్, సుదర్శనం, గుర్రం శ్రీహరి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2లోని న్యూ మారేడు పాకలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎస్‌ఓటూ జీఎం ఎం.రాముడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తాళ్ల అమృతమ్మ, అసిస్టెంట్ బ్రాంచీ సెక్రెటరీ శ్యామ్‌సన్, డీజీఎంపర్సనల్ అధికారప్రతినిధి ఎస్.అనిల్‌కుమార్, సెక్టార్-3 డిస్పెన్సరి సూపరిండెంట్ డాక్టర్ మహిపాల్, పర్యావరణ అధికారి వేణు, డాక్టర్ సాహితి, తాళ్ల రాజయ్య, ప్యారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

- జాతీయ ఎస్‌సీ కమిషన్ సభ్యుడు రాంచందర్

గోదావరిఖని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని జాతీయ ఎస్‌సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. గోదావరిఖని జీఎం ఆఫీస్ వద్ద భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఎస్‌సీ, ఎస్‌టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భవించి 42సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ ఎస్‌సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ ఆవరణలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా కమిషన్ పరిధి హక్కుల గురించి వివరించారు. ఏరియా ఉపాధ్యక్షులు జనగామ నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 జీఎం డీ లలిత్ కుమార్‌తోపాటు అధికారులు, అసోసియేషన్ అధ్యక్షులు యాట ఓదెలు, చీఫ్ అడ్వైజర్ పులిమోహన్, జనరల్ సెక్రెటరీ గంగారపు లింగమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆరెపల్లి రామచందర్, నాయకులు బడికెల కృష్ణ, నాతరి రాయమల్లు, రమేష్, ప్రవీణ్ కుమార్, దేవయ్య, రాజశేఖర్, శంకర్, రాజలింగు, తిరుపతి, ఉమేందర్, రమేష్, ముదుసు రమేష్, కళ్యాణ్, అశోక్, కుమార్ రాజేందర్ పాల్గొన్నారు. అంతకుముందు ఎస్సీఎస్టీ ఆఫీస్‌నుంచి డప్పు చప్పుళ్లు, కోలాట బృందాల నృత్యాలతో నాయకులు, అధికారులు జీఎం ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు.



సభలో మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

ఖనిలో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సుమారు 64 ఎగ్జిబిట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సైన్స్ ఫెయిర్‌ను ట్రస్మా జిల్లా అధ్యక్షులు కంది రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చందుపట్ల తిరుపతిరెడ్డి, కార్పొరేటర్ ఎండి ముస్తాఫా ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఇలాంటి సైన్స్ ఫెయిర్‌తో వెలికి వస్తాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారపు యాదగిరిగౌడ్, కార్పొరేషన్ ఏరియా ట్రస్మా అధ్యక్షులు అదర్‌సండే సమ్మారావు, నోయల్ జోసెఫ్, లక్కాకుల రవి, వైస్ ప్రిన్సిపల్ ఏఆర్ ఎడ్విన్, శైలజ, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేందుకే స్టడీ టూర్

ధర్మారం, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేసేందుకే స్టడీ టూర్‌కి వెళ్లామని ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్ అన్నారు. స్టడీ టూర్‌లో భాగంగా కర్ణాటకకు వెళ్లిన ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమటీ పాలకవర్గం అక్కడి రైతులు పాటిస్తున్న మెళకువలను స్టడీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కర్ణటకలోని విజయపుర, సిందాగి, జావేర్గి మార్కెట్‌లను సందర్శించి అక్కడి పంటలను పరిశీలించారు. కర్ణటక రైతులు కందులు, పెసల్లుతోపాటు ఇతర పప్పు దినుసులను ఎక్కువగా పండిస్తారని, అలాగే విజయపుర మర్కెట్ పరిధిలోని రైతులు పత్తి పంటలు ఎక్కువగా పండిస్తున్నారని తెలిపారు. వైస్‌చైర్మన్ లింగయ్య, భూమయ్య, శ్రీనివాస్, తిరుపతి, మహిపాల్, రాజేశం, గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

ధర్మారం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అమిత్ షా విమర్శించడం తగదని మండల దళిత సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసనగా దళిత సంఘ నాయకులు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నిరసన తెలిపారు. మాజీ ఎంపీటీసీ కాంపెల్లి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాడే సూర్యనారాయణ, విఎస్ఎస్ మాజీ చైర్మన్ దేవి జనార్ధన్, తెలంగాణ మాదిగ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సుంచు మల్లేశం, బొల్లి నందయ్య, పెరుక బానేష్, ఓరెం చిరంజీవి, శనిగరపు మల్లేశం, దూడ సురేష్, ఏదుల్ల అంజయ్య, గంగయ్య, గోగు దేవేందర్, ఏదుల్ల ప్రభాకర్, ప్రశాంత్, సూర్య చరణ్, శ్రీకాంత్, పోచయ్య, బాపు, ప్రశాంత్, అరవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను అమిత్‌షా హేళన చేసి మాట్లాడటం సరికాదని సీపీఐ కమాన్‌పూర్ మండల శాఖ ఖండించింది. శనివారం స్థానిక కాలనీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మంథని నియోజకవర్గ ఇంచార్జీ గౌతంగోవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్.ప్రకాష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు అన్నారావు, ఎజ్జే రాజయ్య, కె.రాజయ్య, మహేందర్, ఆంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సుల్తానాబాద్, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు సుల్తానాబాద్‌కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో నిర్వహించిన పోటీలలో మెన్, ఉమెన్ వివిధ వయస్సుల విభాగాల్లో మొదటి స్థానాలు సాధించారు. స్కూల్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రమాద బీమా చెక్కు అందజేత

ముత్తారం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మచ్చుపేటకు చెందిన ఎస్‌బీఐ పాలసీదారుడు కోట శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా రూ.5 లక్షల బీమా చెక్కును శనివారం పెద్దపల్లి డివిజన్ మేనేజర్ మురళీ మోహన్ వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో డివిజన్ మేనేజర్ మురళీ మోహన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపతి, ఏజెన్సీ మేనేజర్ సిద్ద సాగర్, లైఫ్‌మిత్ర గొర్ల నవీన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.